నేటి కందం- నేటికి అందం

గట్టిగ సాధన జేయుచు
పట్టును సాధించి ప్రథమ బహుమతి నొందన్
కట్టుగ భారత క్రికెటు
జట్టును నడిపించ నిదెద సబలలకు నతుల్ !!

(మొట్టమొదటి సారిగా మహిళా క్రికెట్ పోటీలలో భారత్ మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్పు సాధించింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

ప్రైవేట్ లో పరిశోధన
పాలకుల లక్ష్యం
ప్రకటించిన లక్ష కోట్ల
ప్రతిపాదనే సాక్ష్యం.
కార్పోరేట్ల చేతుల్లో
కావాలని పెట్టడం
ప్రభుత్వ పరిశోధనను
పట్టపట్టి చంపడం

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 5-11-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:69 పేజీలు:6 వెల: రూ.1/-


## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రైలు ప్రమాదం.. గూడ్స్ రైలును ఢీకొట్టిన కోర్బా ప్యాసింజర్..

# 10 మంది దుర్మరణం



ఛత్తీస్‌గఢ్, నవంబర్ 4: ఛత్తీస్‌గఢ్ లోని బిలాస్‌పూర్ లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న కోర్బా ప్యాసింజర్ రైలు.. జయరామ్ నగర్ స్టేషన్ వద్ద ఆగివున్న గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఈ ఘటనలో 10 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ప్రమాద సమాచారం అందిన వెంటనే రెస్క్యూ టీమ్స్ ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మృతదేహాలను ట్రెయిన్ నుంచి వెలికితీశాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో ఆస్పత్రులకు తరలించాయి. ఘటనా ప్రాంతంలో ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్ రూల్ ఆఫ్ లా ఇండెక్స్-2025లో దిగజారిన ఇండియా ర్యాంకు

### -143 దేశాలకు గానూ గత ఏడాది 79వ స్థానంలో నిలిచిన భారత్..

న్యూఢిల్లీ, నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : మోదీ పాలనలో దేశం తిరోగమనం చెందుతున్నది. దేశ ప్రగతికి కొలమానంగా నిలిచే పలు అంతర్జాతీయ సూచీల్లో భారత్ ర్యాంకు అంతకంతకూ దిగజారుతున్నది. తాజాగా విడుదలైన వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్ రూల్ ఆఫ్ లా ఇండెక్స్-2025లో ఇండియా ర్యాంకు మరింత పతనమైంది. 143 దేశాలకు గానూ గత ఏడాది 79వ స్థానంలో నిలిచిన భారత్.. ఈ ఏడాది ఏడు స్థానాలు దిగజారి 86వ ర్యాంకులో నిలిచింది. ప్రభుత్వ అధికారాలపై నియంత్రణలు, అవినీతి రాహిత్యం, ప్రభుత్వ పారదర్శకత, ప్రాథమిక హక్కులు, శాంతి భద్రతలు, చట్టాల అమలు వంటి అంశాలలో ఆయా దేశాలలో సాధించిన ప్రగతి ప్రాతిపదికన చట్టబద్ధ పాలన సూచీ రూపొందుతుంది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూల్ ఆఫ్ లా ఇండెక్స్‌లో భారత్ ర్యాంకు ఏటికేడు దిగజారుతూ వస్తున్నది. 2015లో ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో భారత్ 57వ స్థానంలో ఉండగా, 2025కి 86వ ర్యాంకుకు దిగజారింది.

ఇక అవినీతిరహిత దేశాల జాబితాలో గత ఏడాది 97వ స్థానంలో ఉండగా, ఈ ఏడాది 99వ స్థానానికి చేరింది. మోదీ పాలనలో దేశంలో ప్రజల ప్రాథమిక హక్కులు ఏ స్థితిలో ఉన్నాయో రుజువు చేసేందుకు ఈ ర్యాంకే నిదర్శనం. 2015లో భారత్ 62వ స్థానంలో ఉండగా, ఈ ఏడాది 103వ స్థానానికి పడిపోయింది. చట్టాల అమలు యంత్రాంగం పనితీరులోనూ శాంతి భద్రతల విషయంలో గత ఏడాది 98వ ర్యాంకులో ఉన్న భారత్ ఈ ఏడాది 105వ స్థానానికి పడిపోవడం క్షీణించిన శాంతి భద్రతల పరిస్థితికి అద్దంపడుతుంది. చట్టాల అమలు యంత్రాంగం పనితీరులో గత ఏడాది 78వ ర్యాంకులో ఉన్న భారత్ ఈ ఏడాది 79వ స్థానానికి పడిపోయి మోదీ ప్రభుత్వ వైఫల్యాలను బహిర్గతం చేసింది.

## తాండూరు వద్ద సిమెంట్ లారీని ఢీకొన్న కర్ణాటక ఆర్టీసి బస్సు

### ఈ ప్రమాదంలో పలువురికి గాయాలు




హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: వికారాబాద్ జిల్లా తాండూరు వద్ద మరో కర్ణాటక ఆర్టీసి బస్సుకు ప్రమాదం జరిగింది. కరణ్ కోట్ సమీపంలో ఎదురుగా వస్తున్న సిమెంట్ లారీని కర్ణాటక ఆర్టీసి బస్సు ఢీకొంది. గుల్బర్గా నుంచి తాండూరు వైపు వస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్, కండక్టర్ కు స్వల్ప గాయాలవ్వగా, ఓ ప్రయాణికుడికి తలకు గాయం అయింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నారు. వాహనాలను పక్కకు పోలీసులు తొలగించారు.

బస్సు ప్రమాదాలు ఒకదానికొకటి వరుసగా జరుగుతుండడంతో తీవ్రంగా ఆశ్చర్యానికి, ఆవేదనకు గురిచేస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు

## సీఎం రేవంత్‌తో జర్మనీ బృందం భేటీ..



హైదరాబాద్, నవంబర్ 4: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందం ఈరోజు (మంగళవారం) భేటీ అయ్యింది. డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ను నేడు నగరంలో ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి జర్మనీ బృందం వివరించింది. జీసీసీ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు జర్మనీ బృందానికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ఇందుకు ప్రజాప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. హైదరాబాద్ డ్యుయిష్ బోర్స్ కంపెనీ జీసీసీ ఏర్పాటుతో వచ్చే రెండేళ్లలో ఐటీ రంగంలో వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు సీఎంకు జర్మనీ బృందం వివరించింది.

హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని జర్మనీ బృందాన్ని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్‌లో జర్మనీ టీచర్లను నియమించి తెలంగాణ విద్యార్థులకు జర్మనీ భాషను నేర్పించేందుకు సహకరించాలని జర్మనీ కాన్సుల్ జనరల్‌ను రేవంత్ కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగంలో జర్మనీ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని కోరారు. వీటితో యాఓఆూట ద్వారా వొకేషనల్ ఎడ్యుకేషన్, స్కిల్ వర్క్ విషయంలో శిక్షణ అందించేందుకు సహకరించాలని జర్మన్ బృందాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ భేటీలో అమిత దేశాయ్, డ్యుయిష్ బోర్స్ అమో/అూూ డాక్టర్ క్రిస్టోఫ్ బోమ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ కేటాయింపు

### -మైనార్టీ సంక్షేమ శాఖతోనే సరిపెట్టిన ముఖ్యమంత్రి

హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : రాష్ట్ర మంత్రి అజారుద్దీన్‌కు ప్రభుత్వం శాఖ కేటాయించింది. అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాణస్వీకారం చేసిన నాలుగు రోజులకు అజారుద్దీన్‌కు శాఖ కేటాయించారు. మొత్తంగా రాష్ట్ర కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. మరో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. జూ బ్లీహిల్స్ ఉప ఎన్నికలో మైనార్టీల ఓట్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చిన సంగతి తెలిసిందే. 'బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముస్లింకు హోంశాఖ ఇచ్చారు. ఇప్పుడు కూడా హోంశాఖను నాకు కేటాయించి



ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించాలి' అని అజారుద్దీన్ సీఎం రేవంత్‌ను కోరినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. తనకు హోం శాఖ ఇస్తేనే ముస్లిం మైనార్టీలు ప్రభుత్వాన్ని నమ్ముతారని, జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అనవసర చర్చలకు తావులేకుండా శాఖల కేటాయింపు వీలైనంత త్వరగా ముగించాలని అజారుద్దీన్ కోరినట్టు తెలిసింది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద ఉన్న కీలక శాఖలు ఎవరికీ ఇచ్చేది లేదని, మైనార్టీ వెల్ఫేర్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాలని చెప్పినట్టు సమాచారం. జూబ్లీహిల్స్‌లో ఓడినా పోయేదేమీ లేదు.. హోంశాఖ మాత్రం ఇంకొకరికి ఇచ్చే ప్రసక్తి లేదని తెగేసి చెప్పినట్టు ప్రచారం అవుతున్నది. ఆ మేరకే అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.

## చేవెళ్ల బస్సు ప్రమాదాన్ని సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర హెచ్ఆర్సీ

హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పరిధిలోని మిర్జాగూడ గేట్ వద్ద జరిగిన బస్సు ప్రమాదాన్ని రాష్ట్ర హెచ్ఆర్సీ సుమోటోగా స్వీకరించింది. ఈ ప్రమాద ఘటనపై డిసెంబర్ 15వ తేదీ లోపు నివేదిక సమర్పించాలని మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. రవాణా శాఖ, హోం శాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసింది. జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారిని, రంగారెడ్డి కలెక్టర్, ఆర్టీసీ ఎండీని నివేదిక పంపాలని హెచ్ఆర్సీ ఆదేశించింది. నిన్న మిర్జాగూడ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో టిప్పర్, బస్సు డ్రైవర్లు ఇద్దరు సహా 19 మంది దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే. తాండూరు నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును అతివేగంగా వచ్చిన కంకర టిప్పర్ బలంగా ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకున్నది. వికారాబాద్ జిల్లా తాండూరు డిపో ఆర్టీసీ బస్సు (టీఎస్ 34టీఏ6354) తాండూరు నుంచి తెల్లవారుజామున 4:30 గంటలకు 30 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. మార్గంమధ్యలో వికారాబాద్ తదితర బస్టాప్‌లలో ఎక్కిన వారితో కలిపి మొత్తం 72 మంది ప్రయాణికులతో వెళ్తున్నది. చేవెళ్ల మండల పరిధిలోని మిర్జాగూడ గేట్ సమీపంలోని హైదరాబాద్-బీజాపూర్ హైవేపై చేవెళ్ల నుంచి వికారాబాద్‌కు కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ (టీజీ 06టీ3879) వాహనం ఎదురుగా అతి వేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొట్టి, దానిపై పూర్తిగా ఒరిగిపోయింది. దానిలో ఉన్న కంకరమొత్తం బస్సులోకి జారింది. దీంతో ఆర్టీసీ బస్సు కుడివైపున 8 వరుసల సీట్లు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ఆ సీట్లలో కూర్చున్న కొందరు ప్రయాణికులు బలమైన గాయాలతో మరణించగా, మరికొందరు కంకరలో కూరుకుపోయి ఊపిరాడక విలవిల్లాడుతూ చనిపోయారు. బస్సు డ్రైవర్‌తోపాటు టిప్పర్ డ్రైవర్ కూడా దుర్మరణం చెందారు. వీరితోపాటు 17 మంది ప్రయాణికులు ప్రాణాలొదిలారు. మృతుల్లో 12 మంది మహిళలు ఉండగా, ఆరుగురు పురుషులు, 10 నెలల చిన్నారి ఉన్నారు. మరో 25 మంది కి తీవ్రగాయాల పాలయ్యారు.

## నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో భారీ వర్షం..లోతట్టు ప్రాంతాలు జలమయం



నాగర్ కర్నూల్, నవంబర్ 4: జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల కాలనీలకు భారీగా వర్షం నీరు చేరుకుంది.

పట్టణంలోని 9వ జంక్షన్, అంబేద్కర్ చౌరస్తా, నాగునులు చౌరస్తా, లిటిల్ ఫ్లవర్ స్కూలు ప్రాంతాల్లోని ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది . ఈ సందర్భంగా కిలోమీటర్ పొడవున వాహనాలు నిలిచిపోయాయి.

రోడ్డు పొడవున డివైడర్ ఉండడంతో ఎత్తు ప్రాంతాల నుంచి మినీ ట్యాంక్ బండ్ (కేసరి సముద్రం చెరువు) వైపు వెళ్లాల్సిన వర్షం నీరు ప్రధాన రోడ్డుపై నిలిచిపోయింది. పోలీసులు వాహనాలను మళ్లించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. డివైడర్ నాలుగు ఫీట్ల ఎత్తులో ఉండడంతో వర్షపు నీరుతో నిండిపోయాయి. విద్యా సంస్థలు వదిలే సమయంలో ఒక్కసారిగా స్కూల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్ర వాహనాలు రోడ్లపైకి రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## అమెరికా మాజీ వైస్ ప్రెసిడెంట్ డిక్ చెనీ కన్నుమూత

న్యూఢిల్లీ, నవంబర్ 4:అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు డిక్ చెనీ కన్నుమూశారు. న్యుమోనియా, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అమెరికా చరిత్రలోనే అత్యంత శక్తిమంతమైన ఉపాధ్యక్షుడిగా చెనీ పేరుపొందారు. అగ్రరాజ్యం 46వ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ఆయనకు 9/11 ఉగ్రదాడులకు ప్రతీకారంగా అగ్రరాజ్యం చేపట్టిన 'వార్ ఆన్ టెర్రర్ (ఉగ్రవాదంపై యుద్ధం)' ప్రధాన రూపకర్తగా గుర్తింపు ఉంది.

ఇరాక్ లక్ష్యంగా ఆయన పదేపదే చేసిన ఆరోపణలు 2003లో ఆ దేశంపై అమెరికా దాడులు చేయడంలో కీలకపాత్ర పోషించాయి. డిక్ చెనీ 1941లో నెబ్రాస్కాలో జన్మించారు. చట్టసభ సభ్యుడిగా, వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా, డిఫెన్స్ సెక్రెటరీగా విధులు నిర్వహించారు. 2001-09 మధ్య కాలంలో అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. దశాబ్దాలుగా శక్తిమంతమైన రిపబ్లికన్ నేతగా నిలిచారు.

కఠిన సంప్రదాయవాది అయిన చెనీ తన చివరి సంవత్సరాల్లో ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను తీవ్రంగా విమర్శించారు. ఆయన్ను పిరికిపందగా, దేశానికి అతిపెద్ద ముప్పుగా పేర్కొన్నారు. దాంతో పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఆ క్రమంలో 2024 అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌కు ఓటేసినట్లు చెనీ ప్రకటించారు.

## వ్యవసాయ రంగం అభివృద్ధి దేశ ఆర్థిక ప్రగతికి మూలం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 4:దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా.. వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అగ్రి బిజినెస్ అవార్డులు ఇవ్వడం ద్వారా భారతదేశ వ్యవసాయ రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న రైతులకు, ఇన్నొవేటర్స్, అగ్రిప్రెన్యూర్స్‌ని గౌరవించుకోవడమేనని పేర్కొన్నారు. ఇవాళ(మంగళవారం) హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్‌లో అగ్రి బిజినెస్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. దేశంలోని 54 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పుకొచ్చారు కిషన్‌రెడ్డి.

వ్యవసాయ రంగం దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉందని వివరించారు. ఆత్మ నిర్భర భారత్ దిశగా దూసుకెళ్లేందుకు వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఉద్ఘాటించారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బలంగా నమ్ముతారని నొక్కిచెప్పారు. అందుకే అనేక పథకాలు రైతులకు మేలు చేసేలా రూపొందించారని తెలిపారు. ఈ ఏడాది చైనాను దాటేసి 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో భారతదేశం ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచిందని ఉద్ఘాటించారు. 2014 నుంచి 2015 మధ్యలో పాల ఉత్పత్తి 63 శాతం పెరిగిందని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే దేశంగా మనం నిలిచామని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి.

పప్పు ధాన్యాల ఉత్పత్తిలో తొలిస్థానంలో నిలిచాం..

పప్పు ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచలోనే తొలిస్థానంలో నిలిచామని వివరించారు. దేశంలో 26 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా విషయంలో ఎన్ని ఇబ్బందులు తలెత్తినా ఆహార ధాన్యాలు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేరే దేశాలకు కూడా భారతదేశం నుంచి ఎగుమతి చేశామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలోని 80 కోట్ల మందికి ఉచితంగా 5 కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్, పీఎం కృషి సించాయి యోజన వంటి అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి.

రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశాం..

2019లో పీఎం సమ్మాన్ నిధి యోజన ప్రారంభించినప్పటి నుంచి



11.8 కోట్ల మంది రైతులకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా రైతులకు భరోసా దక్కిందని నొక్కిచెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు లబ్ధి పొందుతున్నారని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు వరి ధాన్యం కనీస మద్దతు ధర భారీగా పెంచామని వెల్లడించారు. జీఎస్టీ 2.0 ద్వారా రైతులకు ఉపయోగపడేలా ట్రాక్టర్లు, మెషీన్లపై భారీగా జీఎస్టీ తగ్గించామని ప్రకటించారు. జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పుకొచ్చారు. సాగు ఖర్చు కూడా భారీగా తగ్గి, రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి అగ్రి టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## కార్తీక పౌర్ణమి రోజున ఆకాశంలో అద్భుత దృశ్యం..

హైదరాబాద్, నవంబర్ 4: ఖగోళప్రియులకు వింతలను వీక్షించాలని భావించే వారికి గుడ్‌న్యూస్. కార్తీక పౌర్ణమి రోజున ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతం కానున్నది. అంటే నవంబర్ 5న ఆకాశంలో చంద్రుడు సాధారణం కంటే పెద్దగా, మరింత ప్రకాశవంతంగా కనిపించనున్నాడు. దీన్నే బీవర్ సూపర్ మూన్‌గానూ పిలుస్తారు. ఈ సూపర్ అరుదైన ఖగోళ దృగ్విషయం కాగా.. పౌర్ణమి సమయంలో చంద్రుడు తన కక్ష్యలో తిరుగుతూ భూమికి అత్యంత దగ్గరగా చేరడంతో ఈ అద్భుతం దృశ్యం ఏర్పడుతుంది.

గతంలో ఇలాంటి అదృశ్యం చైనాలోని చెంగ్డులోని లాంగ్‌క్వాన్ పరత్వ ప్రాంతంలో ఈ దృశ్యం కనిపించింది. ఈ సారి భూమికి చంద్రుడు మరింత దగ్గరగా ఉంటాడు. చల్లని శరదృతువు రాత్రిలో మరింత ప్రకాశవంతంగా ప్రకాశిస్తాడు. ఈ సూపర్‌మూన్ ఈ ఏడాదిలో ఏర్పడనున్న మూడు సూపర్‌మూన్‌లో రెండోది. ఉత్తర అమెరికాలోని స్థానిక తెగల నుంచి బీవర్ సూపర్ మూన్‌గా పేరు వచ్చింది. బీవర్లు శీతాకాలంలో గుహలను నిర్మించే, నదులు గడ్డకట్టే ముందు వేటగాళ్లు ఉచ్చులు వేసే సీజన్‌ను ఇది సూచిస్తుంది.

చంద్రుడు భూమి చుట్టూ తిరిగే కక్ష్య పూర్తిగా వృత్తాకారంలో ఉండదు. కానీ, కక్ష్యలో తిరిగే సమయంలో భూమికి చంద్రుడు దగ్గరగా, దూరంగా వెళ్తుంటాడు. పౌర్ణమి రోజున చంద్రుడు తన కక్ష్యలో భూమికి దగ్గరగా వచ్చిన దృశ్యాన్ని సూపర్ మూన్‌గా పిలుస్తారు. ఈ సమయంలో చంద్రుడు భూమి నుండి దాదాపు 3,57,000 కిలోమీటర్ల దూరంలో ఉంటాడు. ఈ కారణంగా ఇది సాధారణ పౌర్ణమి కంటే ఏడుశాతం పెద్దగా ఉంటుంది.

# సునామి జల ప్రళయం ఓ మహా విపత్తు

## (05 నవంబర్ "ప్రపంచ సునామీ అవగాహన దినం" సందర్భంగా)

సముద్రంలో భూకంపాలు రావడం, వాల్కనో విస్ఫోటనాలు జరగడం, కొండచరియలు విరిగిపడడం, అగ్నిపర్వతాలు బద్దలు కావడం, ఉల్కాపాతం ఉద్భవించడం లాంటి విపత్తులు సంభవించినపుడు సముద్రపు అలలు నోళ్లు తెరుచుకొని ఉవ్వెత్తున 100 అడుగుల ఎత్తు వరకు ఎగిసిపడుతూ, గంటకు 800 కిమీ వేగంతో రాకాసి అలలు ప్రయాణిస్తూ, తీర ప్రాంత జనావాసాలను మహా విపత్తు ముంచేయడమనే సునామి అని అంటాం. 26 డిసెంబర్ 2004 తొలి సారి హిందూ మహాసముద్రంలో భూకంపం రావడంతో ప్రపంచ చరిత్రలో ఓ అత్యంత విధ్వంసకర సునామి రావడం, 14 దేశాలకు చెందిన 2,83,000 మందిని పొట్టన పెట్టుకోవడం చూసాం.

### భవిష్యత్తు తరాలను సన్నద్ధం చేద్దాం:

సునామి అనబడే జపానీస్ పదానికి "హార్బర్ కెరటం" అని అర్థం. పసిఫిక్ మహాసముద్రంలో "రింగ్ ఆఫ్ ఫైర్" కారణంగా 80 శాతం వరకు సునామీలు సంభవిస్తున్నాయి. ఇలాంటి అత్యంత ప్రమాదకర సునామి ప్రళయాల్లో నష్టాన్ని తగ్గించడానికి ముందస్తు గుర్తించడం, హెచ్చరికలు జారీ చేయడం, సత్వరమే చర్యలకు పూనుకోవడం, ఆధునిక పరిశోధనలతో సునామి రాకను ముందే పసిగట్టడం, తీర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించడం లాంటి లక్ష్యాలను పెట్టుకొని 2015లో ఐరాస సభ్యదేశాలు తీసుకున్న నిర్ణయం ప్రకారం 2016 నుంచి ప్రతి ఏట 05 నవంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా "ప్రపంచ సునామీ అవగాహన దినం" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ సునామీ అవగాహన దినం-2025 ఇతివృత్తంగా "సునామీలు తట్టుకోవడానికి తయారుగా ఉందాం – సునామి నష్టాల నివారణకు పెట్టుబడులు పెడదాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు.

### సునామి విపత్తుల నష్టాలను తగ్గించడం:

సునామి విపత్తుల పట్ల విషయ పరిజ్ఞానాన్ని వ్యాప్తి చేయడం, విపత్తు ప్రమాదపు అంచున నివసిస్తున్న తీర ప్రాంత ప్రజలను సన్నద్ధంమచేయడం, గత సునామి చరిత్ర నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం, సునామి బాధితులకు సంఘీభావం తెలియజేయడం, ఆధునిక డిజిటల్ శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో సునామీలను ముందస్తు అంచనాలతో హెచ్చరికలు జారీ చేయడం, ప్రపంచ దేశాలు సమన్వయంతో పని చేయడం, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని ఏకరువు పెట్టడం, రాబోయే తరాలకు సునామి పట్ల కనీస జ్ఞానాన్ని అందించడం లాంటి అంశాలు సునామి వల్ల జరిగే ప్రాణ ఆస్తి నష్టాలను పూర్తిగా తగ్గిస్తాయని గమనించాలి.

పర్యావరణ కాలుష్యంతో సంభవిస్తున్న ప్రతికూల వాతావరణ మార్పుల కారణంగా కూడా సునామీలు ఎగిసిపడవచ్చని తెలుసుకుందాం. సునామి విపత్తుల గూర్చి పూర్తి అవగాహనను ఆకలింపు చేసుకుందాం. సునామీలు నేర్పిన గత గుణపాఠాలను మరువకుండా రాబోయే రోజుల్లో రాకాసి అలల వలలో పడకుండా తీర ప్రాంత మానవాళిని కాపాడుదాం. సునామి సృష్టించే విధ్వంసానికి అడ్డుకట్ట వేద్దాం.

–డా౹౹ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# నైతిక విలువలతో కూడిన, మానవ కేంద్రిత ఏఐకు అవసరమైన అంతర్జాతీయ నియమావళిని భారత్ రూపొందిస్తోంది: పీఎం

న్యూఢిల్లీ, నవంబర్ 4:ఈ రోజు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ (ఈఎస్‌టీఐసీ) 2025లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్రమోదీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. దేశ విదేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు, పరిశోధనా సంస్థల సభ్యులు, ఇతర విశిష్ట అతిథులకు స్వాగతం పలికారు. ఐసీసీ మహిళ ప్రపంచ కప్ 2025లో భారత క్రికెట్ జట్టు సాధించిన అద్భుతమైన విజయంతో దేశమంతా ఆనందంతో ఉప్పొంగిపో యింద న్నారు. తొలిసారి భారత్ మహిళా ప్రపంచ కప్ గెలిచిందంటూ.. దీన్ని సాధించిన మహిళల జట్టుకు అభినందనలు తెలియజేశారు. వారిని చూసి దేశం గర్విస్తోందని, వారు సాధించిన విజయం దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది యువతకు స్ఫూర్తినిస్తుందన్నారు.

ప్రపంచ శాస్త్ర, సాంకేతిక రంగంలో భారత్ నిన్న అపూర్వమైన విజయాన్ని సాధించిందని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారతీయ శాస్త్రవేత్తలు.. దేశ భూభాగం నుంచి అత్యంత బరువైన ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగిం చారన్నారు. ఈ మిషన్లో భాగమైన శాస్త్రవేత్తలందరికు, ఇస్రోకు అభినందనలు తెలియజేశారు. శాస్త్ర, సాంకేతిక రంగంలో ఈ రోజు చరిత్రాత్మకంగా నిలిచిపోతుందన్నారు. 21వ శతాబ్దంలో.. అభివృద్ధి చెందుతున్న నూతన శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణలకు దిశను అందించేందుకు అంతర్జాతీయ నిపుణులంతా ఒక్క చోట చేరి చర్చించాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. ఈ అవసరమే.. ఒక ఆలోచనకు నాంది పలికిందని.. అదే.. ఈ సదస్సుకు దార్శనికతగా మారిందన్నారు. ఇప్పుడు ఈ సదస్సు ద్వారా ఆ లక్ష్యం రూపం సంతరించుకుంటోందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రైవేటు రంగ సంస్థలు, అంకుర సంస్థలు, విద్యార్థులు పాల్గొన్నారని ప్రధాని గుర్తించారు. వీరందరి మధ్యలో నోబెల్ పురస్కార గ్రహీత ఉండటం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమైన హాజరైన వారందరికీ స్వాగతం చెబుతూ.. సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

అపూర్వమైన ప్రగతికి చెందిన కాలంగా 21వ శతాబ్దాన్ని వర్ణిస్తూ.. అంతర్జాతీయ క్రమంలో కొత్త మార్పులు చూస్తున్నామని, వాటి వేగం సాధారణంగా కాకుండా.. విశేషంగా ఉందని శ్రీ మోదీ అన్నారు. ఈ దృక్పథంతోనే నూతన శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణలకు సంబంధించిన వివిధ అంశాల్లో భారత్ ముందుకు వెళుతోందని, వాటిపై నిరంతరం దృష్టి సారిస్తోందన్నారు. దీనికి ఉదాహరణగా పరిశోధనలకు కేటాయించిన నిధులను చూపించారు. అలాగే అందరికీ సుపరిచితమైన జాతీయ లక్ష్యం 'జై జవాన్, జై కిసాన్'ను గుర్తు చేసుకుంటూ.. పరిశోధనల పునరుజ్జీవానికి ప్రాధాన్యమిస్తూ.. ఈ నినాదానికి 'జై విజ్ఞాన్', 'జై అనుసంధాన్' కూడా జోడించామని తెలిపారు. భారతీయ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి అనుసంధాన్ నేషనల్ రీసెర్చి ఫౌండేషన్ ఏర్పాటైందని వెల్లడించారు. వీటికి అదనంగా, రూ. 1 లక్ష కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల పథకాన్ని ప్రారంభించామని ప్రకటించారు. ప్రైవేటు రంగంలో సైతం పరిశోధనాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. "అధిక నష్టానికి, అధిక ప్రభావానికి వీలున్న ప్రాజెక్టులకు మొదటిసారిగా మూలధనం అందుబాటులోకి వస్తుంది" అని శ్రీ మోదీ చెప్పారు.

"ఆధునిక ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించేందుకు, పరిశోధనా సౌలభ్యాన్ని మెరుగుపరిచేందుకు భారత్ కృషి చేస్తోంది" అంటూనే ఆర్థిక నియమాలు, సేకరణ విధానాల్లో అనేక సంస్కరణలను ప్రభుత్వం తీసుకువచ్చిందని ప్రధాని స్పష్టం చేశారు. అదనంగా.. ప్రయోగశాల నుంచి మార్కెట్‌కు ప్రాథమిక నమూనాలు వేగంగా చేరేలా నియంత్రణలు, ప్రోత్సాహకాలు, సరఫరా వ్యవస్థల్లో అనేక సంస్కరణలను తీసుకొచ్చారు.

భారత్‌ను ఆవిష్కరణల ప్రధాన కేంద్రంగా మార్చేందుకు ఇటీవలి సంవత్సరాల్లో చేపట్టిన అనేక విధానాలు, నిర్ణయాలు స్పష్టమైన ఫలితాలను ఇస్తున్నాయని వెల్లడిస్తూ.. ముఖ్యమైన గణాంకాలను శ్రీ మోదీ పంచుకున్నారు. గడచిన దశాబ్దంలో భారత పరిశోధన అభివృద్ధికి సంబంధించిన వ్యయం రెట్టింపయింది. రిజిస్టర్ చేసుకున్న పేటెంట్ల సంఖ్య 17 రెట్లు పెరిగింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద అంకుర సంస్థల వ్యవస్థగా భారత్ ఎదిగింది. స్వచ్ఛ ఇంధనం, అధునాతన సామగ్రి లాంటి రంగాల్లో 6,000కు పైగా డీప్ టెక్ అంకుర సంస్థలు పనిచేస్తున్నాయి... అంటూ ఆయన తెలియజేశారు. భారతీయ సెమీ కండక్టర్ రంగం ఇప్పుడు వేగాన్ని పుంజుకుంటోందని ప్రధానమంత్రి అన్నారు. దేశంలో బయో ఎకానమీ వృద్ధి 2014లో రూ.10 బిలియన్ డాలర్ల నుంచి.. ప్రస్తుతం 140 బిలియన్ డాలర్లకు విస్తరించింది.

ఇటీవలి సంవత్సరాల్లో.. హరిత హైడ్రోజన్, క్వాంటమ్ కంప్యూటింగ్, సముద్ర అంతర్భాగ పరిశోధన, కీలకమైన ఖనిజాలు తదితరమైన కొత్తగా పుట్టుకొస్తున్న రంగాల్లో గణనీయమైన విజయాలు సాధిస్తూ.. భారత్ తన ఉనికిని చాటుతోందని శ్రీ మోదీ వివరించారు.

"సైన్సు విస్తృతమైనప్పుడు, ఆవిష్కరణలు అందరికీ చేరువైనప్పుడు, సాంకేతికత మార్పును నడిపిస్తున్నపుడు.. గొప్ప విజయాలకు పునాది ఏర్పడుతుంది" అని ప్రధానమంత్రి చెప్పారు. ఈ దార్శనికతకు గడచిన 10-11 ఏళ్లుగా భారత్ సాగించిన ప్రయాణం ఉదాహరణగా నిలుస్తోందన్నారు. భారత్ ఇకపై సాంకేతిక వినియోగదారు మాత్రమే కాదని, సాంకేతికత ద్వారా పరివర్తనకు మార్గదర్శిగా నిలుస్తోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. కొవిడ్-19 మహమ్మారి సందర్భంలో రికార్డు సమయంలో దేశీయంగా వ్యాక్సిన్ను భారత్ అభివృద్ధి చేసిందని, ప్రపంచంలోనే అతిపెద్ద టీకా కార్యక్రమం చేపట్టిందని గుర్తు చేశారు.

బృహత్ స్థాయిలో విధానాలను, పథకాలను భారత్ ఏ విధంగా అమలు చేయగలుగుతుందో ప్రధాన మంత్రి వివరించారు. ఈ విజయానికి ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిన భారత డిజిటల్ మౌలిక వసతులే కారణమని తెలియజేశారు. రెండు లక్షలకు పైగా గ్రామ పంచాయతీలను ఆప్టికల్ ఫైబర్ ద్వారా అనుసంధానించామని.. దేశవ్యాప్తంగా మొబైల్ డేటాను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చామని ఆయన వివరించారు.

భారత అంతరిక్ష కార్యక్రమం చంద్రుడిని, అంగారక గ్రహాన్ని చేరుకోవడంతో పాటుగా.. స్పేస్ సైన్స్ అప్లికేషన్ల ద్వారా రైతులు, మత్స్యకారులకు కూడా తోడ్పడుతోందని శ్రీ మోదీ అన్నారు. ఈ విజయాల వెనుక ఉన్నవారందరి భాగస్వామ్యాన్ని ప్రస్తావించారు.

సమ్మిళిత ఆవిష్కరణలకున్న ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. ఆవిష్కరణ అందరికీ చేరితే.. దాని ప్రాథమిక లబ్ధిదారులు సైతం నాయకులుగా మారతారని ప్రధానమంత్రి అన్నారు. దీనికి సరైన ఉదాహరణ భారతీయ మహిళలే అన్నారు. భారతీయ అంతరిక్ష కార్యక్రమాల గురించి అంతర్జాతీయంగా చర్చించిన ప్రతి సందర్భంలోనూ మహిళా శాస్త్రవేత్తలకు తగిన గుర్తింపు లభిస్తోందని తెలియజేశారు. మేధో హక్కుల విషయానికి వస్తే.. దశాబ్దం క్రితం భారత్‌లో మహిళలు 100 కంటే తక్కువే పేటెంట్లకు దరఖాస్తు చేశారని, ఇప్పుడు ఆ సంఖ్య ఏడాదికి 5,000 దాటిందని తెలియజేశారు. భారత్‌లో స్టెమ్ రంగాల్లో విద్యను అభ్యసిస్తున్న వారి సంఖ్య 43 శాతంగా ఉందని.. ఇది అంతర్జాతీయ సగటు కంటే ఎక్కువ అని ఆయన వెల్లడించారు. ఈ గణాంకాలన్నీ.. దేశ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మహిళలు సాధిస్తున్న వేగవంతమైన పురోగతిని ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు.

చరిత్రలో కొన్ని క్షణాలు, కొన్ని తరాల పాటు స్ఫూర్తినందించేవిగా నిలిచిపోతాయని ప్రధానమంత్రి అన్నారు. కొన్నేళ్ల క్రితం.. దేశంలోని చిన్నారులు చంద్రయాన్ ప్రయాణాన్ని చూశారని, దానికి సంబంధించిన ఒడిదొడుకులు, విజయాలను తెలుసుకొని, సైన్స్ పట్ల ఎలా ఆసక్తిని పెంచుకున్నారో గుర్తుచేసుకున్నారు. ఇటీవలే అంతరిక్ష కేంద్రానికి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా చేపట్టిన యాత్ర చిన్నారుల్లో సరికొత్త ఆసక్తిని రేకెత్తించిదన్నారు. యువతరంలో పెరుగుతున్న ఆ ఉత్సాహాన్ని ఉపయోగించుకోవాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణల దిశగా ఎంతమంది యువతను నడిపిస్తే.. భారత్‌కు అంత మంచి జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ లక్ష్యానికి అనుగుణంగానే.. దేశవ్యాప్తంగా 10,000 అటల్ టింకరింగ్ ప్రయోగశాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీటిలో ఒక కోటి మందికి పైగా చిన్నారులు ఉత్సాహంగా, సృజనాత్మకంగా ప్రయోగాలు చేస్తున్నారన్నారు. ఈ విజయం అందించిన ప్రోత్సాహంతో.. 25,000 కొత్త అటల్ టింకరింగ్ ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇటీవలి కాలంలో ఏడు ఐఐటీలు, పదహారు ఐఐఐటీలతో సహా వందల సంఖ్యలో కొత్త విశ్వవిద్యాలయాలు ఏర్పాటయ్యాయని ప్రధానమంత్రి వెల్లడించారు. నూతన విద్యా విధానం ప్రకారం సైన్స్, ఇంజనీరింగ్ లాంటి స్టెమ్ కోర్సులను విద్యార్థులు వారి ప్రాంతీయ భాషల్లో నేర్చుకోవచ్చు న్నారు.

యువ పరిశోధకుల్లో ప్రధాన మంత్రి రీసెర్చి ఫెలోషిప్ గొప్ప విజయాన్ని సాధించిందని, ఇది వారికి తగినంత సాయం చేస్తుందని శ్రీ మోదీ తెలిపారు. అలాగే దేశంలో ఆర్ అండ్ డీని మరింత బలోపేతం చేసేలా వచ్చే అయిదేళ్ల కాలానికి 10,000 ఫెలోషిప్పులు అందిస్తామని శ్రీ మోదీ ప్రకటించారు.

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానానికి ఉన్న పరివర్తనాత్మక శక్తిని అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరిస్తూ.. అవి నైతికంగా, సమ్మిళితంగా ఉండేలా చూసుకోవాలని ప్రధాని అన్నారు. రిటైల్, రవాణా నుంచి వినియోగదారుల సేవలు, చిన్నారుల హోంవర్కు వరకు విస్తృతంగా ఉపయోగిస్తున్న కృత్రిమ మేధను దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. సమాజంలో ప్రతి వర్గానికి ఏఐను ప్రయోజనకరంగా మార్చేందుకు భారత్ పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఇండియా ఏఐ మిషన్ పరిధిలో రూ.10,000 కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి.

"నైతిక విలువలతో కూడిన, మానవాళికి ఉపయోగపడే ఏఐ కోసం అంతర్జాతీయ నియమావళిని భారత్ రూపొందిస్తోంది" అని ప్రధాని అన్నారు. ఈ దిశగా త్వరలో రానున్న ఏఐ పరిపాలనా నియమావళి కీలకమైనది అవుతుందని, ఆవిష్కరణలు భద్రతను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఉంటుందని వివరించారు. 2026 ఫిబ్రవరిలో అంతర్జాతీయ ఏఐ సమ్మేళనానికి భారత్ ఆతిథ్యమిస్తుందని, ఇది సమ్మిళితమైన, నైతికమైన, మానవ ప్రయోజనకర ఏఐ దిశగా ప్రయత్నాలను వేగవంతం చేస్తుందన్నారు.

అభివృద్ధి చెందిన భారత్ దిశగా లక్ష్యాన్ని సాధించడంలో కీలకంగా మారుతున్న, నూతనంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ప్రయత్నాలను వేగవంతం చేయాలని పిలుపునిస్తూ.. ఆహార భద్రత నుంచి పోషకాహార భద్రతకు దృష్టిని మరల్చాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా పోషకాహార లోపాన్ని ఎదుర్కొనేందుకు బయోఫోర్టిఫైడ్ పంటలను భారత్ అభివృద్ధి చేస్తుందా తక్కువ ఖర్చుతో కూడుకున్న ఎరువులు, జీవ ఎరువులు.. రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా పనిచేసి.. భూసారాన్ని పెంచుతాయా వ్యక్తి అవసరానికి తగినట్లుగా ఔషధాలు, వ్యాధుల అంచనాను అభివృద్ధి చేయగలిగేలా జెనోమిక్ వైవిధ్యాన్ని భారత్ ముందుకు నడిపించగలదా? బ్యాటరీల లాంటి స్వచ్ఛ ఇంధన స్టోరేజీల్లో నూతన, సరసమైన ఆవిష్కరణలను అభివృద్ధి చేయగలదా? అంటూ కీలకమైన ప్రశ్నలు సంధించారు. ఏ అంశాల్లో భారత్ ప్రపంచంపై ఆధారపడి ఉందో గుర్తించి ఆయా రంగాల్లో స్వావలంబన సాధించాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు.

శాస్త్ర సాంకేతిక రంగంలో ఉన్నవారు తమకు ఎదురైన ప్రశ్నల పరిధిని దాటి కొత్త అవకాశాలను అన్వేషిస్తారన్న విశ్వాసాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు. ఆలోచనలతో వచ్చిన వారికి తన సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే పరిశోధనకు అవసరమైన నిధులను సమకూర్చడంలో, శాస్త్రవేత్తలకు అవకాశాలను అందించడంలో ప్రభుత్వం నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ సదస్సు నుంచి సమష్టి ప్రణాళిక రూపొందాలని ఆకాంక్షించారు. అలాగే భారతీయ ఆవిష్కరణల ప్రయాణాన్ని సరికొత్త శిఖరాలకు ఈ సదస్సు చేరుస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. "జై విజ్ఞాన్, జై అనుసంధాన్" నినాదంతో తన ప్రసంగాన్ని ముగించారు.

కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, భారత ప్రభుత్వానికి ప్రధాన సైంటిఫిక్ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, నోబెల్ పురస్కార గ్రహీత సర్ ఆండ్రీ గీమ్, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశంలో ఆర్ అండ్ డీ వ్యవస్థకు ప్రోత్సాహాన్ని అందించేలా రూ. 1 లక్ష కోట్లతో ఏర్పాటు చేసిన పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణ (ఆర్డీఐ) పథకాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. ప్రైవేటు రంగం సారథ్యంలో దేశంలో పరిశోధన, ఆవిష్కరణల వ్యవస్థను ప్రోత్సహించడమే ఈ పథకం లక్ష్యం.

ఈఎస్‌టీఐసీ 2025 సదస్సు 2025 నవంబర్ 3 నుంచి 5 వరకు జరుగుతుంది. ఈ సదస్సులో విద్య, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలకు చెందిన 3,000 మందితో పాటుగా నోబెల్ విజేతలు, ప్రముఖ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు, విధాన రూపకర్తలు పాల్గొన్నారు. అధునాతన పరికరాలు – తయారీ, కృత్రిమ మేధ, బయో- మాన్యుఫాక్చరింగ్, సముద్ర ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ కమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్-సెమికండక్టర్ తయారీ, నూతన వ్యవసాయ సాంకేతికతలు, ఇంధనం, పర్యావరణం-వాతావరణం, ఆరోగ్య -వైద్య సాంకేతికతలు, క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్ష సాంకేతికతలు సహా 11 ప్రధానాంశాలపై చర్చలు జరుగుతాయి.

ప్రముఖ శాస్త్రవేత్తల ప్రసంగాలు, ప్యానెల్ చర్చలు, ప్రజెంటేషన్లు, సాంకేతికత ప్రదర్శనలు ఈఎస్‌టీఐసీ 2025లో ఉంటాయి. ఇది పరిశోధకులు, పరిశ్రమలు, యువ ఆవిష్కర్తల మధ్య భాగస్వామ్యానికి అవసరమైన వేదికను అందిస్తూ.. భారతీయ శాస్త్ర సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

# పంటకు ధర నిర్ణయించే స్థాయికి రైతులు ఎదగాలి

## –జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నవంబర్ 4: రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించి తమ పంటకు తామే ధర నిర్ణయించే స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని




క్రాంతి నగర్‌లో డీపీఎంయు ఆధ్వర్యంలో జరుగుతున్న టీఐసీఆర్‌పీ ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించి తమ పంటకు తామే ధర నిర్ణయించే స్థాయికి ఎదగాలని, మార్కెటింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో ఒక లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం విస్తరింపజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం, వ్యవసాయ శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 50 వేల మంది రైతులు మాత్రమే పాక్షికంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తుండగా, పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు 6 వేల మంది ఉన్నారని వివరించారు. ప్రకృతి వ్యవసాయం విస్తరణలో మహిళా సంఘాల పాత్ర అత్యంత కీలకం అని కలెక్టర్ పేర్కొన్నారు. వారు గ్రామ స్థాయిలో రైతులను ప్రేరేపిస్తూ, సహకార వ్యవస్థల ద్వారా పద్ధతుల అమలులో ముందుండాలని సూచించారు. ఇంటి వద్ద కిచెన్ గార్డెన్లు, అంగన్వాడీ సెంటర్లు మరియు పాఠశాలల్లో పెరటి తోటలు ఏర్పాటు చేసి, భావితరాల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని టి?ఐసీఆర్‌పీలకు కలెక్టర్ సూచించారు.

ప్రతి టిఐసీఆర్‌పీ ఒక ఆదర్శ రైతుగా ఎదిగి, ఇతరులను ప్రకృతి వ్యవసాయం వైపు మార్చేలా ప్రేరేపించాలన్నారు. పురుగు తెగుళ్ల నివారణకు రసాయనాల బదులు కషాయాలు వాడాలని, యూరియా డీఏపీ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. అలాగే, గట్లపై చెట్లను నాటి పర్యావరణ సమతౌల్యం కాపాడాలని పేర్కొన్నారు. మొక్కలకు అవసరమైన పోషకాలు సమతుల్యంగా అందించాలని, 365 రోజుల పాటు పంట వైద్యాన్ని పాటించడం ద్వారా భూసారం పెంచవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రకృతి వ్యవసాయం ప్రతి ఒక్కరి చేత సాధ్యమేనన్నారు. అందరూ నైపుణ్యం కలిగిన రిసోర్స్ పర్సన్‌లుగా ఎదిగి, ఏపిసియన్ఎఫ్ ప్రాజెక్టు లక్ష్యాలను నెరవేర్చాలని, రైతు బలంగా ఉంటే దేశం బలంగా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.సి. మద్దిలేటి, డిపిఎం శ్రీనివాసులు, ఏడిపిఎం అబ్దుల్ సలాం, జిల్లా ఎన్ఎఫ్ఏలు, డి.టి.టిలు, టీ?ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

## –ఆదేశించిన భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి



యాదాద్రి భువనగిరి, నవంబర్ 4:యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం యాదాద్రి భువనగిరి ఆర్డిఓ ఎం కృష్ణారెడ్డి పరిశీలించారు. నిత్యం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దాన్యంలో తేమ శాతం రాక రైతులు ఇబ్బందులు పడతారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం ఉన్న రైతుల ధాన్యాన్ని తక్షణమే తూకాలు వేసి మిల్లులకు తరలించాలని ఆర్డీవో కృష్ణారెడ్డి బ్యాంక్ సి ఈ ఓ వరలక్ష్మిని ఆదేశించారు.

లారీ లోడ్ ధాన్యం కోసం ఎదురు చూడవద్దని,తేమ శాతం కలిగిన రైతుల ధాన్యాన్ని తూకాలు వేసి వెంటనే ట్రాక్టర్ల ద్వారానైనా మిల్లులకు తరలించాలన్నారు .ఈ సందర్భంగా ఆర్ డి ఓ రైతులతో మాట్లాడి వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండి విడిగా ధాన్యపు రాశులపై టార్పాలిన్ లు కప్పుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసిల్దార్ జ్యోతి, ఆర్ ఐ సుమన్ ,ఏవో కీర్తి ,సిబ్బంది శ్రీకాంత్ చారి తదితరులున్నారు.




# ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవాలని వేడుకోలు

## –ఆందోళనలో అన్నదాతలు

## –వర్షానికి కూలుతున్న ఇండ్లు

అమరావతి, నవంబర్ 4: నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చేతికొచ్చిన పత్తి, వరి పంటలు వర్షాల కారణంగా నేలమట్టం కావడంతో రైతన్నల పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి, కంది, వరి పంటలు దెబ్బతిన్నాయి.

వానాకాలంలో సాగుచేసిన వివిధ పంటల పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితులు లేవని అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంట చేతికి వచ్చి వ్యవసాయ పొలాల్లో రైతులు పత్తి తొలగిస్తున్న తరుణంలో వర్షాల కారణంగా చేతికొచ్చిన పత్తి పంట వర్షార్పణం కావడంతో కర్షకుల పరిస్థితి అయోమయంగా మారింది. ఊట్కూర్ మండలంలో ఈ ఏడాది రైతులు అధిక శాతం పత్తి పంట సాగు చేయగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల తడిసి పంట దెబ్బతింటుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాల కారణంగాఊట్కూర్ మండల కేంద్రంలోని కుర్వగేరి వీధికి చెందిన కుర్వ మల్లేష్, శ్రీ కృష్ణనగర్ వీధికి జాజాపురం పద్మమ్మ ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. ఊట్కూర్ మండలంలో సోమవారం రాత్రి 22.6 మి మి వర్షపాతం నమోదు కాగా ఈ రోజు 4మి మి వర్షపాతం నమోదైనట్లు ఏ ఎస్ ఓ చేతన్‌తెలిపారు. ఈదురు గాలులకు వర్షానికి వరి పంట నేలకూలడంతో తీవ్ర నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. వర్షాలు ఈదురుగాలులకు పంటలు నష్టపోయిన రైతులను, ఇండ్లు కూలిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

# సెంట్రల్ లైటింగ్ పనులు పరిశీలించిన ఈఈ

అమరావతి, నవంబర్ 4: సెంట్రల్ లైటింగ్ పనులను మంగళవారం నాడు ఆర్ అండ్ బి శాఖ ఈఈ మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కాంట్రాక్టర్ ను సెంట్రల్ లైటింగ్ పనులు తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్తు స్తంభాలు, మిషన్ భగీరథ, ఓ ఎఫ్ సి లైన్ ఉండటంవల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాంట్రాక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి ఈ వినోద్, ఏఈ భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

# నవ రాయ్‌పూర్‌లో జరిగే ఛత్తీస్‌గఢ్ రజత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ సి. పి. రాధాకృష్ణన్ హాజరుకానున్నారు

న్యూఢిల్లీ, నవంబర్ 4:భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి. పి. రాధాకృష్ణన్ నవంబర్ 4-5, 2025 తేదీలలో ఛత్తీస్‌గఢ్ పర్యటనకు వెళతారు, పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన తొలిసారి రాష్ట్రానికి వస్తున్నారు. ఈ పర్యటనలో, ఆయన నవ రాయ్‌పూర్ మరియు రాజ్‌నంద్‌గావ్‌లలో జరిగే వరుస ప్రజా కార్యక్రమాల్లో పాల్గొంటారు, ఇందులో ఛత్తీస్‌గఢ్ ఏర్పాటుకు 25వ వార్షికోత్సవానికి ప్రతీకగా జరిగే రజత్ మహోత్సవ్ వేడుకలు కూడా ఉంటాయి.

కేరళ మరియు తమిళనాడు పర్యటనను ముగించిన తర్వాత, ఉపరాష్ట్రపతి ఈ సాయంత్రం రాయ్‌పూర్ చేరుకుంటారు.

నవంబర్ 5, 2025న, శ్రీ సి. పి. రాధాకృష్ణన్‌కు రాయ్‌పూర్‌లోని రాజ్‌భవన్‌లో గౌరవ వందనం అందిస్తారు. ఆ తర్వాత ఆయన నవ రాయ్‌పూర్‌లోని సెంధ్ లేక్‌లో భారత వైమానిక దళానికి చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం (ఎస్‌కెఎటి) నిర్వహించే వైమానిక ప్రదర్శనను వీక్షిస్తారు. 1996లో ఏర్పడిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం, ఖచ్చితమైన విమాన ప్రదర్శన మరియు అద్భుతమైన వైమానిక ప్రదర్శనలకు ప్రసిద్ధి చెందింది.

నవంబర్ 5, 2025న ఉపరాష్ట్రపతి రాజ్‌నంద్‌గావ్‌లో ఉదయాచల్ మల్టీ-స్పెషాలిటీ ఐ కేర్ ఇన్‌స్టిట్యూట్‌ను కూడా ప్రారంభిస్తారు.

తరువాత, శ్రీ సి.పి. రాధాకృష్ణన్ రాజ్‌నంద్‌గావ్‌లో జరిగే లఖ్‌పతి దీదీ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు.

నవ రాయ్‌పూర్‌లో సాయంత్రం జరిగే ఛత్తీస్‌గఢ్ రజత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన తన పర్యటనను ముగించనున్నారు. ఛత్తీస్‌గఢ్ ఏర్పడి 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రజత్ మహోత్సవ్‌ను జరుపుకుంటున్నారు.

# నాణ్యతపై రాజీ పడొద్దు - పవన్ కళ్యాణ్

## -గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.2 వేల కోట్లు

## -సాస్కి నిధులను సద్వినియోగం చేసుకోండి

హైదరాబాద్, నవంబర్ 4: గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సాస్కి పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.2 వేల కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులను సద్వినియోగం చేసి ప్రజలకు పటిష్టమైన రహదారులు అందించాల్సిందిగా పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

సాస్కి నిధులతో నిర్మించే రహదారుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

"నిర్మాణ దశ నుంచి పూర్తయ్యే వరకు క్వాలిటీ చెక్ తప్పనిసరిగా జరగాలి. అధికారులు స్వయంగా తనిఖీలు చేయాలి. ప్రమాణాలు పాటించకపోతే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అవకతవకలు జరిగితే ఎవరినీ ఉపేక్షించం," అని ఆయన హెచ్చరించారు.

గ్రామీణ మౌలిక వసతుల బలోపేతమే లక్ష్యం..

ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రంగా దెబ్బతిన్న రహదారులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా మరో ముందడుగు వేసిందని పవన్ తెలిపారు.

పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా రహదారి సదుపాయాల బలోపేతానికి రూ.35 కోట్లు సాస్కి నిధుల నుంచి కేటాయించినట్లు పవన్ వెల్లడించారు. ఇలాంటి ప్రత్యేక ప్రాజెక్టులకు సాస్కి నిధులు ఎంతో తోడ్పడతాయని చెప్పారు.

రోడ్ల నిర్మాణంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించిందని పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. కేంద్రం నుంచి నిధులు వచ్చే అవకాశాలు ఉన్నా, వాటిని వాడుకోలేదని అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేంద్ర సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

# మహానందిలో భక్తుల సమస్యలు తీర్చండి..

## -ఎగ్జిక్యూటివ్ అధికారులకు వినతి పత్రం..



నంద్యాల, నవంబర్ 4: కార్తీకమాసం సందర్భంగా కార్తీక పౌర్ణమి రోజున మహానంది పుణ్యక్షేత్రానికి హాజరయ్యే భక్తుల సమస్యలను, కష్టాలను ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్ రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. నవనందులు పాదయాత్ర చేసే భక్తులకు ఆలయంలో ప్రత్యేక క్యూ లైన్ దర్శనం ఏర్పాటు చేయాలన్నారు. నవనందులు పాదయాత్ర చేసిన భక్తులు మహానందికి వచ్చే సమయానికి కాళ్ల నొప్పులతో దెబ్బలతో బాధ అనుభవిస్తూ ఉంటారు. సాధారణ క్యూ లైన్ లో నిలబడి దైవదర్శనానికి ఇబ్బందులు ఎదుర్కొంటారు. కాబట్టి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేయాలని కోరారు.

నవగ్రహాల వద్ద భక్తులను క్యూ లైన్ లో నిలబడకుండా ఏర్పాటు చేయాలన్నారు. ఒత్తులు వెలిగించాలని బలవంతంగా దారి మూసివేయడం భక్తులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు. కోటి దీపోత్సవం వద్ద మహిళలు కూర్చోవడానికి ప్రత్యేక మార్కింగ్ ఏర్పాటు చేసి పూజలు నిర్వహించాలని సూచించారు.

ఆలయ గర్భగుడిలో ప్రత్యేక కార్యక్రమాలు నిలిపివేసి ప్రతి ఒక్కరికి సాధారణ దర్శనం వేగవంతంగా కల్పించాలని, కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లారు. మహానంది క్షేత్రంలో వాహనాలను క్రమబద్ధీకరించాలన్నారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల నాయకులు మురళి, ప్రసాద్ ,కాకర్ల శివ, రామచంద్రుడు, కాకర్ల రామకృష్ణ ,చందు, సుబ్బరాయుడు, మద్దిలేటి, పలువురు పాల్గొన్నారు.

# షట్‌డౌన్‌తో సిబ్బంది కొరత.. అమెరికాలో స్తంభించిన విమాన సేవలు

న్యూ డిల్లీ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ అక్టోబర్ 1 నుంచి మొదలైన విషయం తెలిసిందే. దీంతో కొన్ని అత్యవసర సేవల విభాగాలకు మినహా.. మిగిలిన అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగుల వేతనాలు, ఇతర చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయి. అనేక నగరాల్లోని విమానాశ్రయాల్లో 'ఏటీసీ' సిబ్బంది విధులకు హాజరుకావటం లేదు. ఎయిర్‌పోర్ట్సులో సిబ్బంది కొరత ఏర్పడింది. ఫలితంగా అమెరికా వ్యాప్తంగా విమానాల రాకపోకలు స్తంభించిపోయాయి.ఆదివారం ఒక్క రోజే దాదాపు 5 వేలకు పైగా విమానాలు ఆలస్యంగా నడిచినట్లు అమెరికా మీడియా నివేదించింది. సోమవారం మధ్యాహ్నానికి 2,530కి పైగా విమానాలు ఆలస్యం కాగా, 60కి పైగా సర్వీసులు రద్దయ్యాయని పేర్కొంది. చికాగో, నెవార్క్, జాన్ ఎఫ్. కెన్నడీ, అట్లాంటా వంటి ప్రధాన విమానాశ్రయాల్లో వేలాది విమానాలు ఆలస్యమవుతుండగా, ఎయిర్‌పోర్టుల్లో భద్రతా తనిఖీల కోసం గంటల తరబడి సమయం పడుతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. లాస్‌ఏంజిల్స్, కాలిఫోర్నియా, చికాగో, వాషింగ్టన్, న్యూజెర్సీ, న్యూయార్క్ సహా అమెరికా వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉంది. వారాంతాల్లో అయితే, ఈ పరిస్థితి మరింత దిగజారుతోంది. విమానం ఆలస్యం, రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

షట్‌డౌన్‌తో అమెరికాకు 62 వేల కోట్ల నష్టం

సేనేట్‌లో రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన ఫెడరల్ నిధులకు చెందిన బిల్లుకు (టబీనిటతినిణ ఎతిశ్రీశ్రీ) ఆమోదం దక్కకపోవడంతో అక్టోబర్ 1న అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ షట్‌డౌన్ కారణంగా అగ్రరాజ్యంలో ఆర్థిక సంక్షోభం తలెత్తింది. అక్టోబర్ 1 నుంచి ఇప్పటి వరకూ దాదాపు 7 బిలియన్ డాలర్ల (రూ. 62,195 కోట్లు) నష్టం వాటిల్లింది. షట్‌డౌన్ ఎత్తివేసి పూర్వ పరిస్థితులు ఏర్పడినా అది తిరిగి పొందలేని నష్టమని నిష్పక్షపాతంగా పనిచేసే కాంగ్రెస్ బడ్జెట్ ఆఫీస్ (సీబీఓ) కొత్త నివేదిక తెలిపింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే కాలానికి మరింత నష్టం ఏర్పడుతుందని పేర్కొంది.

భవిష్యత్తులో ఏర్పడబోయే నష్టం అంచనాను హౌస్ బడ్జెట్ కమిటీకి రాసిన లేఖలో సీబీవో వివరించింది. నాలుగు వారాల షట్‌డౌన్‌లో వాస్తవ స్థూల దేశీయోత్పత్తి 7 బిలియన్ డాలర్లు తగ్గిపోయింది. ఆరువారాల షట్‌డౌన్‌లో 11 బిలియన్ డాలర్లు, ఎనిమిది వారాల షట్‌డౌన్‌లో 14 బిలియన్ డాలర్లు (రూ. 1,24,390 కోట్లు) తగ్గుతుందని సీబీఓ అంచనా వేసింది. షట్‌డౌన్ సమయంలో 10 లక్షల మంది కార్మికులకు ఎలాంటి జీతం చెల్లించకపోవడం వల్ల వస్తువులు, సేవలపై వినియోగం బాగా తగ్గిపోయింది. షట్‌డౌన్ కారణంగా ఎక్కువ మంది ఫెడరల్ ఉద్యోగులకు ఎలాంటి చెల్లింపులు జరగడం లేదు. సేనేట్‌లో రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన ఫెడరల్ నిధులకు చెందిన బిల్లుకు ఆమోదం దక్కకపోవడంతో అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ప్రకటించింది. అమెరికా కాలమానం ప్రకారం సెప్టెంబర్ 30, అర్ధరాత్రి (11:59 నిమిషాలు) వరకు ఆ బిల్లు క్లియరెన్స్ కోసం ఎదురుచూశారు. కానీ డెమొక్రాట్లు తగ్గకపోవడంతో.. ట్రంప్ సర్కారు షట్‌డౌన్ ప్రకటించింది. సేనేట్‌లో రిపబ్లికన్లకు కంట్రోల్ ఉన్నా.. బిల్లును పాస్ చేయించుకోలేకపోయారు. ఫండింగ్ బిల్లు సేనేట్‌లో పాస్ కాకపోవడం వల్ల నిరవధికంగా ప్రభుత్వ షట్‌డౌన్ ప్రకటిస్తున్నట్లు వైట్‌హౌజ్ పేర్కొన్నది. గడిచిన ఏడేళ్లలో ఇలా జరగడం ఇదే

# మాజీ సిఎం వైసిపి జగన్ మోహన్ రెడ్డి పర్యటనలో అపశ్రుతి



అమరావతి నవంబర్ 4 (ఎక్సం ప్రెస్ న్యూస్ );: కృష్ణా జిల్లా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో మాజీ సిఎం వైసిపి జగన్ మోహన్ రెడ్డి పర్యటనలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఉయ్యూరు మండలం గండిగుంట వద్ద ఆయన కాన్వాయ్ లోని వాహనాలు ఒకదానికొకటి ఢీకొని పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఆ దారిలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

# ప్రధాన మంత్రి స్వస్థ సురక్ష యోజన కింద కొత్తగా ప్రారంభించిన ఆసుపత్రి భవనాన్ని ప్రశంసించిన ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబర్ 4:భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు తిరువనంతపురంలోని ప్రతిష్ఠాత్మక శ్రీ చిత్ర తిరునాల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ని సందర్శించారు. ఎస్‌సిటిఐఎమ్‌ఎస్‌టి అనేది భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కింద జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ, ఇది ఇంటిగ్రేటెడ్ మెడికల్ సైన్స్, టెక్నాలజీ మరియు అధునాతన ఆరోగ్య సంరక్షణలో దాని మార్గదర్శక సహకారాలకు ప్రసిద్ధి చెందింది.

తన పర్యటన సందర్భంగా, ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ తిరువనంతపురంలోని అచ్యుత మీనన్ సెంటర్ ఫర్ హెల్త్ సైన్స్ స్టడీస్ లో శ్రీ చిత్ర తిరునాల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ అధ్యాపకులు మరియు స్టార్టప్ కంపెనీలు అభివృద్ధి చేసిన వైద్య పరికరాల ప్రదర్శనను ప్రారంభించారు.

ఇన్స్టిట్యూట్‌లో తన ప్రసంగంలో, ఉపరాష్ట్రపతి వైద్య శాస్త్రాలు మరియు బయోమెడికల్ టెక్నాలజీని కలిపి దేశానికి సేవ చేయడంలో 40 సంవత్సరాలకు పైగా ఇన్స్టిట్యూట్ యొక్క వారసత్వాన్ని ప్రశంసించారు. భారతదేశంలోని ఇతర సంస్థలు అనుకరించాలని కోరుకునే ఫ్లాగ్‌షిప్ మోడల్‌గా ఇన్స్టిట్యూట్ పాత్రను హైలైట్ చేస్తూ, తక్కువ ఖర్చుతో కూడిన చిత్ర హార్ట్ వాల్వ్, చిత్ర బ్లడ్ బ్యాగ్ మరియు క్షయవ్యాధికి స్పాట్ డయాగ్నస్టిక్ పరీక్షలు వంటి స్వదేశీ వైద్య పరికరాల అభివృద్ధిలో దాని విజయాలను ఆయన ప్రశంసించారు, ఇవి ప్రపంచ గుర్తింపు పొందాయి.

పేటెంట్ దరఖాస్తులు, డిజైన్ రిజిస్ట్రేషన్లు మరియు విజయవంతమైన సాంకేతిక బదిలీలలో ఇన్స్టిట్యూట్ యొక్క అద్భుతమైన రికార్డును శ్రీ సి. పి. రాధాకృష్ణన్ ప్రశంసించారు, విక్సిత్ భారత్ ఏ2047 దార్శనికత ప్రకారం భారతదేశం యొక్క స్వావలంబన వైపు ప్రయాణంలో పరిశోధన ఢ ఆవిష్కరణల పాత్రను నొక్కి చెప్పారు. పేద జనాభాకు సేవ చేయడానికి మరియు సమాజంపై సానుకూల ప్రభావాన్ని సృష్టించడానికి పరిశోధకులు తమ పరిశోధనలను విస్తరించాలని ఆయన కోరారు.

# సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం అభివృద్ధికి 10 కోట్ల నిధులు మంజూరు

## -జిఓ విడుదల చేసిన ప్రభుత్వం

సంగారెడ్డి నవంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం అభివృద్ధి కొరకు 10 కోట్లు నిధులు మంజూరు కు జిఓ విడుదల చేసిన ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కొరకు ఇండోర్ స్టేడియం లో సైనాథటిక్ కోర్టులు బాస్కెట్ బాల్ వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖో ఖో, కబ్బడి,హాండ్ బాల్ , అధునాతన హంగులతో ఇండోర్ స్టేడియం మరియు వాకింగ్ ట్రాక్, లైటింగ్ అథ్లెటిక్ కోర్ట్ వివిధ క్రీడల అభివృద్ధి అంబెడ్కర్ స్టేడియం లో జరుగుతుందని తెలిపిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అడిగిన వెంటనే 10 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలిపిన తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పన చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి గారు ఇట్టి కార్యక్రమంలో లో జూలకంటి ఆంజనేయులు కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు అడుగడుగునా అవమానాలు

## -దళిత సమాజం తీవ్రం ఆగ్రహం

హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్‌లోని దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మరోసారి అవమానం జరిగింది. ఆయన శాఖలకు కోత విధించారు సీఎం రేవంత్. ప్రస్తుతం అడ్లూరి లక్ష్మణ్ వద్ద ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖలు ఉన్నాయి. ఇక మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో.. లక్ష్మణ్ శాఖలకు కోత పెట్టారు. మంత్రి అడ్లూరి వద్ద ఉన్న మైనార్టీ సంక్షేమ శాఖను అజారుద్దీన్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.సీఎం రేవంత్ రెడ్డి వద్ద ఉన్న హోం శాఖ, మున్సిపాలిటీ, ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ శాఖల్లో ఏదో ఒకటి అజారుద్దీన్‌కు ఇవ్వొచ్చు కదా..? అని దళిత నేతలు నిలదీస్తున్నారు. దళిత మంత్రికి కేటాయించిన శాఖల్లోనే కోత విధించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు మంత్రి పదవులు ఇచ్చినట్టే ఇచ్చి.. అప్రాధాన్యత శాఖలను కేటాయిస్తుందని మండిపడుతున్నారు. ప్రాధాన్యం లేని శాఖలు ఇచ్చి.. తామేదో దళిత ఎమ్మెల్యేలకు మంచి చేసినట్లు కాంగ్రెస్ నాయకత్వం అభిప్రాయ పడడం సరికాదని దళిత నేతలు నిప్పులు చెరుగుతున్నారు. ఇక ఇవాళ తన శాఖల్లోని మైనార్టీ సంక్షేమ శాఖను అజారుద్దీన్‌కు కేటాయించి అడ్లూరి లక్ష్మణ్‌ను అవమానించారు.

# ఢిల్లీ కాంట్‌లోని ఆర్మీ హాస్పిటల్ లోని కాలేజ్ ఆఫ్ నర్సింగ్ VIIIవ బ్యాచ్ ప్రారంభోత్సవ వేడుక




న్యూఢిల్లీ, నవంబర్ 4:కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ఆర్మీ హాస్పిటల్ రీసెర్చ్ అండ్ రెఫరల్ నవంబర్ 04, 2025న ఆర్మీ హాస్పిటల్ లో 29 మిలిటరీ నర్సింగ్ క్యాడెట్‌ల ఎఎఎఎవ బ్యాచ్ ప్రారంభోత్సవ వేడుకను నిర్వహించింది. నాలుగు సంవత్సరాల కఠినమైన విద్య మరియు శిక్షణ ముగింపును గుర్తుచేస్తూ, కొత్తగా నియమించబడిన నర్సింగ్ అధికారులు తమను తాము కరుణామయ సంరక్షకులుగా అంకితం చేసుకుంటామని ప్రిన్సిపాల్ మాట్రన్ గంభీరమైన ప్రమాణం చేశారు.

ఆర్మీ హాస్పిటల్ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ అవినాష్ దాస్ ఈ కార్యక్రమాన్ని సమీక్షించారు. తన ప్రసంగాలలో, అత్యుత్తమ సంప్రదాయాన్ని మరియు 100 సంవత్సరాల మిలిటరీ నర్సింగ్ సేవ యొక్క వారసత్వాన్ని నిలబెట్టడంపై ఆయన నొక్కి చెప్పారు మరియు శాంతి సైనిక స్టేషన్లలో మరియు భౌగోళికంగా కష్టతరమైన భూభాగాలలో దళాలు మరియు వారి కుటుంబాలకు వారి గొప్ప సేవలను ప్రశంసించారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు బృందం అవిశ్రాంత కృషికి ఆయన ప్రశంసలు కురిపించారు.ఈ వేడుకలో అధికారులు, నర్సింగ్ అధికారులు మరియు కొత్తగా నియమితులైన అధికారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అమెరికా వద్ద ప్రపంచాన్ని 150 సార్లు పేల్చేంతగా ఆయుధాలు ఉన్నాయి

## -మరోసారి సమర్థించుకున్నఅమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

న్యూయార్క్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అణ్వాయుధ పరీక్షలు చేపట్టేందుకు జారీ చేసిన ఆదేశాలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి సమర్థించుకున్నారు. అమెరికా వద్ద పుష్కలమైన అణ్వాయుధాలు ఉన్నాయని, ఈ ప్రపంచాన్ని 150 సార్లు పేల్చేంతగా ఆయుధాలు ఉన్నట్లు ఆయన అన్నారు. అయితే వాటిని యాక్టివ్ ట్రయల్స్ ద్వారా మెంటేన్ చేయాల్సి ఉందన్నారు.

సీబీఎస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. 30 ఏళ్ల తర్వాత మళ్లీ ఎందుకు అణ్వాయుధ పరీక్షలకు ఆదేశాలు జారీ చేశారని అడిగిన ప్రశ్నకు ట్రంప్ ఈ రకంగా బదులిచ్చారు.ఆ అణ్వాయుధాలు ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకోవాలని, ఇతర దేశాల తరహాలో తాము కూడా న్యూక్లియర్ వెపన్స్ పరీక్షిస్తామని, ప్రస్తుతం తాము మాత్రమే టెస్ట్ చేయడం లేదని, పరీక్షలు చేపట్టని దేశాల జాబితాలో తాము ఉండడం తనకు ఇష్టం లేదని ట్రంప్ అన్నారు. అమెరికా చివరిసారి 1992లో అణ్వాయుధాన్ని పరీక్షించింది. ఒకవేళ మళ్లీ పరీక్షలు నిర్వహించాలంటే, వందల మిలియన్ల డాలర్లు ఖర్చు అవుతుందని భావిస్తున్నారు. ట్రంప్ ఇచ్చిన ఆదేశాల్లో నిజమైన న్యూక్లియర్ పరీక్షలు ఉండవని ఎనర్జీ మంత్రి క్రిస్ రైట్ క్లారిటీ ఇచ్చారు. వాటిని నాన్ క్రిటికల్ పరీక్షలుగా పిలుస్తున్నట్లు చెప్పారు.రష్యా, చైనా దేశాలు సీక్రెట్‌గా అణు పరీక్షలు చేపడుతున్నట్లు ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. కానీ ఆ రెండు దేశాలు తమ చివరి అణు పరీక్షలను 1990 దశకంలోనే నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇటీవల నిర్వహించిన బురవెస్నిక్ క్రూయిజ్ క్షిపణి, పోసిడాన్ టార్పిడో పరీక్షల్లో అణ్వాయుధం వాడలేదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్ర పీస్కోవ్ తెలిపారు. ఒకవేళ ఇతర దేశాలు అణు పరీక్షలు నిర్వహిస్తే దాని ఆధారంగా తాము చేపడుతామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు.


డా॥ అంబల్ల జనార్ధన్ వజ్రోత్సవ అభినందన సమితి

ఆహ్వానం

డా॥ అంబల్ల జనార్ధన్ గారి వజ్రోత్సవం
శ్రీమతి అంబల్ల సువర్ణ-డా॥ అంబల్ల జనార్ధన్ గార్ల
వివాహ స్వర్ణోత్సవం మరియు



డా॥ అంబల్ల జనార్ధన్‌గారి కథానికా సంపుటి
"ప్రాణధార"
మరియు
"వజ్రోత్సవ అభినందన సంచిక"



ఆవిష్కరణ

సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు
"ప్రాణధార" కథా సంపుటి ఆవిష్కర్త సంపాదకులు: నేటినిజం దినపత్రిక
గౌరవ అతిథి : ఆచార్య డా॥టి.గౌరీశంకర్
అభినందన సంచిక ఆవిష్కర్త అధ్యక్షులు:అం.జి.వజ్రోత్సవ అభినందన సమితి
విశిష్ట అతిథి : శ్రీ రఘుశ్రీ
కార్యదర్శి: అం.జి.వజ్రోత్సవ అభినందన సమితి.
ఆత్మీయ అతిథి : శ్రీ పి. చంద్రశేఖర ఆజాద్
ప్రముఖ రచయిత, కవి.
ఆత్మీయ అతిథి : శ్రీ ఎం.వి. రామిరెడ్డి
ప్రముఖ రచయిత, కవి,
అధ్యక్షులు:రాంకీ ఫౌండేషన్
ఆత్మీయ అతిథి :శ్రీవి.పి.చందన్‌రావు ప్రముఖ కవి,వ్యాఖ్యాత

తేది: 09-11-2025, ఆదివారం, ఉ॥ 11.00 గంటలకు

వేదిక: శ్రీ రాజ రాజేశ్వర-శ్రీ వేంకటేశ్వర మందిర ప్రాంగణ,ధర్మోరా గ్రామం, మోర్తాడ్ మండలం, నిజామాబాద్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

Dharmora on Google Maps
https//maps.app.goo.gl/ZeMkXAKNFyTKWKnzb
ధర్మోరా గ్రామం, హైద్రాబాద్ నుండి దాదాపు 200 కి.మీ.
నిజామాబాద్ నుండి 45 కి.మీ,
ఆర్మూర్ నుండి దాదాపు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.
ముందస్తు సూచన ఇచ్చినచో ఆర్మూర్ నుండి తేది 09-11-2025న
ఉ॥10 గంటలకు ఒక కారు, 10-45 గంటలకు ఒక కారు ఏర్పాటు చేయగలము.

ముఖ్య గమనిక: దయచేసి కానుకలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలు తేవద్దు. వాటి కంటే సభా ప్రాంగణంలో ఉంచిన డా॥అంబల్ల జనార్ధన్ గారు రచించిన కథల పుస్తకాలు రాయితీ ధరపై కొని, చదివి, స్పందిస్తే మాకు సంతోషం.

-డా॥ అంబల్ల జనార్ధన్ వజ్రోత్సవ అభినందన సమితి.

